# సిలికానాంధ్ర విశేషాలు







కాల చక్రం తిరిగి , తిరిగీ మళ్ళీ వస్తుంది మధుమాసం. ప్రకృతి పచ్చని పచ్చిక తివాచీతో వసంతబాలకి స్వాగతం పలుకుతుంది. తెలుగు వారి లోగిళ్ళలో ఉగాది పండుగ దిద్దే రంగవల్లులు రమణీయం..కమనీయం..! మన పల్లెటూళ్ళలో ఉగాది తెచ్చే సంబరాలు మనలో తరం వారికి చాల మందికి గుర్తుండే వుంటుంది. పొద్దున్నే వేప పువ్వు పచ్చడీ, సాయం కాలం గుడిలో పంచాంగ శ్రవణం.. ఒక మాదిరి పట్టణాల్లో ఐతే కవిసమ్మేళనాలూ.. వగైరా.. వగైరా. సంప్రదాయమే సౌందర్యంగా గత నాలుగేళ్ళుగా సరిగ్గా ఇలానే ఉగాది పండుగ సంబరాల్ని నిర్వహిస్తున్న మీ సిలికానాంధ్ర ఈ సంవత్సరం కూడా మన వూరి జ్ఞాపకాల్ని కనుల ముందుకి తెచ్చేలా శ్రీ నవ్య నామ ఉగాది ఉత్సవాన్ని ఏప్రిల్ 1 వ తేదీన లివర్ మోర్ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించబోతోంది. ఉగాది పచ్చడీ, పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలతో బాటు ఈ సారి ఉగాది ఉత్సవంలో మరో ప్రత్యేక ఆకర్షణ ప్రబంధ ఋతు విలాసం..! ప్రబంధాల్లో ఆరు ఋతువుల్నీ వర్ణించే అందమైన పద్యాల నెన్నుకుని వాటిని శ్రావ్యంగా ఆలపించడమే కాకుండా వాటికి సొగసైన, దీటైన, ఆసక్తికరమైన వ్యాఖ్యానాలను కూడ జతచేసి ప్రేక్షకులకి వీనుల విందు, కనుల విందు చేయబోతోంది. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఉపద్రష్ట సత్యంగారు అధ్యక్షత వహించబోతున్నారు. సిలికాన్ వేలీ లోని కవులూ, కవయిత్రులే కాక ఇతర రాష్ట్రాలనుంచీ కూడ కవులు ఈ కవిసమ్మేళనంలో పాల్గొనబోతున్నారు. కమ్మటి లలిత గీతాలాపన కూడా ఈ ప్రధాన కార్యక్రమంలో ఒక అంశంగా వుంటుంది.

ఈ కార్యక్రమం సాయం కాలం 5 గం. నుంచీ రాత్రి 8.00గం. వరకూ జరుగుతుంది.. తరువాత పదహారణాల ఆంధ్ర భోజనం కూడా ప్రేక్షకులకు ఉచితం..!

**మాతృభాషకు వందనం:** ఈ ఉగాది ఉత్సవాల్లో భాగంగానే అమెరికాలోని రేపటి తరం బాల బాలికలకి తెలుగు భాషా సుగంధాల్ని పంచి పెడుతూ, వారిలో మాతృభాష పట్ల మమకారాన్నీ, ఆదరణనీ పెంపొందించే ఆశయంతో 3 సం. వయసునుంచీ 16 సం. వయసూ వరకూ పిల్లలకి తెలుగు భాషలో వివిధ ప్రక్రియల్లో 'తెలుగు భాషా వికాసం' శీర్షిక కింద పోటీలు నిర్వహించబడతాయి. గత రెండేండ్లుగా ఈ పోటీల నిర్వహణ ఆనవాయితీగా వస్తోంది. ప్రతి సారి దాదాపు 150 మందికి పైగా పిల్లలు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ సారి మరింత ఎక్కువమంది పిల్లలు ఈ పోటీల్లో పాల్గొంటారని ఒక అంచనా. అందుకు తగినట్లు సిలికానాంధ్ర అన్ని ఏర్పాట్లూ చేస్తోంది. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రధాన కార్యక్రమంలో బహుమతి ప్రదానం ఉంటుంది.

పూర్తి వివరాలు ఈ వెబ్ సైట్ లో ఎప్పటికప్పుడు అప్-డేట్ చేయ బడతాయి.

**********

సిలికానాంధ్ర, తెలుగు పీపుల్ డాట్ కామ్ సంస్థతో కలిసి సునామీ బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించిన సంగతి మీలో చాలా మందికి గుర్తుండే ఉంటుంది. సుమారు 12 వేల డాలర్లు ప్రపంచ వ్యాప్తంగా వున్న దాతలు ఈ కార్యక్రమానికి విరాళాలు అందించారు. సిలికానాంధ్ర, తెలుగు పీపుల్ డాట్ కామ్ సంయుక్తంగా ఒక శాశ్వత భవనాన్ని నిర్మించాలన్న ఉద్దేశంతో సరైన ప్రదేశం కోసం అన్వేషించడంలో కొంచెం జాప్యం జరిగింది. మచిలీపట్నానికి దగ్గరలో వున్న పెద కరగ్రహారం అనే పల్లెటూరిలో బహుళార్థసాధక భవనాన్ని నిర్మించడానికి ఫిబ్రవరి 8 వతేదీన శంఖుస్థాపన జరిగింది. రెండు నెలల్లోగా భవన నిర్మాణం పూర్తిచేయాలనే పట్టుదలతో ప్రణాళికలు ముందుకి నడిస్తున్నాయి. సిలికానాంధ్ర స్థాపక అధ్యక్షుడు కూచిభొట్ల ఆనంద్ ఈ శంఖుస్థాపన కార్యక్రమానికి స్వయంగా హాజరవడమే గాక, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ సరైన సమయంలో సమకూరేలా శ్రమించి, భవననిర్మాణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. సిలికానాంధ్ర చేపట్టిన ఈ సామాజిక సేవా కార్యక్రమానికి కృష్ణాజిల్లా కలెక్టర్ గారి ద్వారా మాచింగ్ గ్రాంటులు రావడం ఒక విశేషం. ఈ మహత్కార్యానికి విరాళాలిచ్చిన సహృదయులందరికీ సిలికానాంధ్ర మరియూ తెలుగు పీపుల్ డాట్ కామ్ తమ కృతజ్ఞతలు తెలియ చేస్తున్నారు. భవన శంఖు స్థాపన కార్యక్రమం నుంచీ కొన్ని ఫోటోలనిక్కడ చూడొచ్చు. భవన నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు వెబ్ సైట్ ద్వారా అందరికీ తెలియ చేస్తాము.





కృష్ణాజిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే తో ఆనంద్


భూమిపూజ

